

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు
వేగంగా కంప్యూటరీకరించాలి

» జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 9 : ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల వివరాలను వేగంగా కంప్యూటరీకరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చేపట్టిన కంప్యూటరీకరణ ప్రక్రియను ఆయన సోమవారం తనిఖీ చేశారు. అనంతరం కంప్యూటీకరణ చేస్తున్న సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులున్నారు.

నేడు ఇబ్రహీంపట్నంలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

» హాజరు కానున్న మంత్రి శ్రీధర్‌బాబు



ఇబ్రహీంపట్నం, జనవరి 8: ఇబ్రహీంపట్నం గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో నేటి నుండి రెండు రోజులపాటు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు డీఈవో సుశీందర్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ వ్యవహారాలు, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొంటున్నట్టు ఆయన తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు

వీటీజీ సెట్-2024 ప్రవేశ పరీక్ష
దరఖాస్తు గడువు 20 వరకు పొడిగింపు

రంగారెడ్డి అర్బన్, జనవరి 8 : తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సాంఘిక, గిరిజన సంక్షేమ, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల, జనరల్ గురుకులాల 5వ తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్ష వీటీజీ-సెట్ వచ్చేనెల 11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ ఈ నెల 6 ఉండగా దానిని 20 వరకు పొడిగించారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు అర్హులు. దగ్గరలో ఉన్న మీసేవ సెంటర్ లేదా ఇంటర్నెట్ కేంద్రాలకు వెళ్లి వెబ్‌సైట్ ద్వారా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

వీటీజీ సెట్-2024 ప్రవేశ పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ

వీటీజీ-సెట్-2024 ప్రవేశ పరీక్ష పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా ప్రజాపాలన సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, డీఆర్వో సంగీత, ఇతర జిల్లా అధికారుల సమక్షంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య, ఎం.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలన్నా.. ఇతర గుర్తింపు పత్రాలు తీసుకోవాలన్నా.. విద్యార్థులు పై చదువులకు వెళ్లాలన్నా.. ప్రస్తుతం మహిళలు ఆర్టీసీ బస్సు ఎక్కాలన్నా ఆధార్ తప్పనిసరి. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలకు సైతం ఆధార్ కార్డు తప్పనిసరి చేసింది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు, కొత్తగా పొందడానికి, ఉన్నవారు ఫోన్ నెంబరును లింకు చేసుకునేందుకు ఆధార్ సెంటర్‌కు తప్పనిసరి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే పింఛన్లు, రేషన్ కార్డులు, విద్యాసంస్థల్లో ప్రవేశాలు, బ్యాంకు ఖాతాలు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయనిధి, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలకు ఆధార్ తప్పనిసరి అయింది. దీంతో ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకునేందుకు ఆధార్ కేంద్రాలకు వందల సంఖ్యలో బారులు దీరుతున్నారు. ఏ కేంద్రంలో చూసినా భారీ లైన్లు దర్శనమిస్తున్నాయి.



షాద్‌నగర్ ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన ప్రజలు

ఆధార్ కష్టాలు తీరేదెన్నడో!

సవరణల కోసం రోజుల తరబడి పాట్లు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 8: ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ఆధార్ కేంద్రాలకు జనం భారీగా తరలివస్తున్నారు. ప్రధానంగా పల్లెల నుంచి ప్రజలు పెద్ద ఎతున తరలివస్తున్నారు. ఆయా కేంద్రాల వద్ద కనీస వసతులు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఓ వైపు చలి చంపేస్తుంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో శీతల గాలులు వీస్తున్నాయి. చలికి గజగజ వణుకుతూ కేంద్రాల వద్దే చలి మంటలు వేసుకుంటున్నారు. టోకన్ కోసం క్యూలో చెప్పులు ఉంచుతున్నారు. రోజుకు 30-40 టోకన్లు మాత్రమే ఇస్తుండటంతో వాటి కోసం ఎగబడుతున్నారు. కేంద్రాల వద్ద తోపులాటలు, ఘర్షణలు, వాగ్వాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో అరకొర ఆధార్ సెంటర్లు ఉండటమే పెద్ద సమస్యగా మారింది. జిల్లాలో మీసేవ లింకుతో 38 ఆధార్ కేంద్రాలు కొనసాగేవి. చిన్నచిన్న తప్పులు జరగడంతో అందులో 15 కేంద్రాల వరకు యూఐడీఏఐ రద్దు చేసింది. దీంతో 23 కేంద్రాలు మిగిలి పోయాయి. అలాగే ఎడ్యుకేషన్‌కు సంబంధించి 80వరకు ఆధార్ సెంటర్లు ఉన్నాయి. జిల్లాలోని ప్రతి స్కూల్‌కు వెళ్లి అక్కడ విద్యార్థుల వేలి ముద్రలను అప్‌డేట్ చేస్తున్నారు. అలాగే జిల్లాలో పది పోస్టాఫీసుల్లో ఆధార్ సెంటర్లు కొనసాగుతున్నాయి. చాలీచాలని ఆధార్ సెంటర్లతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి.

షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో మూడు ఆధార్ సెంటర్స్ ఉన్నాయి. ఫరూక్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ, కొత్తూరు, కేశంపేట్ మండల ప్రజలతో పాటు ఇతర మండలాల నుంచి షాద్‌నగర్‌లోని ఆధార్ కేంద్రానికి వెళుతున్నారు. కొందుర్గు మండల ప్రజలు ఆధార్ సేవల కోసం వికారాబాద్ జిల్లా పరిగి మండలం చిట్యాలకు తెల్లవారుజామున 3 గంటలకే వెళుతున్నారు. ఇంతకు ముందు కొందుర్గులో ఉన్న ఆధార్ సెంటర్‌ను తిరిగి పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండల ప్రజలు ఆధార్ సేవల కోసం పక్క జిల్లాకు వెళ్లాల్సి వస్తుందంటున్నారు. చేవెళ్లలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఆధార్ సెంటర్ ఒక్కటే ఉంది. షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లో సెంటర్ ఉంది. శంకర్‌పల్లి, మొయినాబాద్ మండల కేంద్రాల్లో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ఆ మండలాల ప్రజలు చేవెళ్ల సెంటర్‌కు వస్తున్నారు. షాబాద్ మండలం సర్దార్‌నగర్ సెంటర్‌కు షాద్‌నగర్ ప్రజలు బారులు తీరుతున్నారు. ఇబ్రహీంపట్నంలో 5 ఆధార్ కేంద్రాలు ఉండగా అందులో రెండు మూత పడ్డాయి. మంచాల మండలంలో ఉన్న రెండు ఆధార్ కేంద్రాలూ మూత పడ్డాయి. యాచారంలో ప్రస్తుతం రెండు కేంద్రాలు కొనసాగుతున్నాయి.



9నెలల చిన్నారితో జేపీ దర్గా నుంచి వచ్చిన అరుణకుమారి

» ఆధార్ సెంటర్లకు తెల్లవారుజామునే చేరుకుంటున్న ప్రజలు
» రోజుకు 30-40 టోకన్లే..? రోజుల తరబడి ప్రదక్షిణలు
» లైన్లలో చెప్పులు.. చలిమంట వద్ద జనం
» జిల్లాలో అరకొర సెంటర్లతో తప్పని ఇబ్బందులు



పది రోజులుగా తిరుగుతున్నా

మా సొంతూరు మహబూబ్‌నగర్. ఉపాధి కోసం ఇక్కడి వచ్చాను. ప్రస్తుతం మొయినాబాద్ పరిసర ప్రాంతాల్లో అద్దెకు ఉంటున్నాను. పది రోజులుగా ఆధార్ అప్‌డేట్ కోసం తిరుగుతున్నాను. రోజు ఉదయం 4 గంటలకు లేచి ఇంటి పనులు చూసుకుని 5 గంటల వరకు చేవెళ్లకు వస్తున్నాను. అప్పటికే పెద్ద లైను ఉంటుంది. టోకెన్ తీసుకుని మూడు రోజులైంది. కానీ.. ఇప్పటి వరకు ఆధార్ అప్‌డేట్ కాలేదు.

- సుమలత, మొయినాబాద్



షాద్‌నగర్‌లోని ఆధార్ సెంటర్ వద్ద టోకెన్‌ల కోసం లైన్లో చెప్పులు

వారం రోజుల నుంచి టోకెన్ దొరకలే

వారం రోజుల నుంచి తిరుగుతున్నాను. ఇప్పటి వరకు నాకు టోకెన్ ఇవ్వలేదు. నా భార్య గర్భవతి. చిన్న పిల్లాడు ఉన్నాడు. వాడిని సంకన ఎత్తుకుని రోజూ ఆధార్ సెంటర్ వద్దకు వస్తున్నాము. చల్లగాలికి పిల్లాడిని తీసుకుని రావాల్సి వస్తుంది. ఆధార్ సెంటర్ల నిర్వహణలో ప్రభుత్వం పట్టించుకోవాలి. మాలాంటి వారికి కష్టాలు లేకుండా చూడాలి.



- ప్రభాకర్, తంగేడపల్లి, చేవెళ్ల మండలం

ఆధార్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలి



కొందుర్గు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇటు పరిగి మండలం చిట్యాల లేదా అటు ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ లేదా షాద్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తుంది. ఆధార్ కార్డుల కోసం రెండు మూడు రోజులు తిరగాల్సి వస్తుంది. అందువల్ల మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలి.

- ఆనంద్, ఉమ్మెంత్యాల, కొందుర్గు మండలం

ఇష్టానుసారంగా డబ్బుల వసూళ్లు..

ఆధార్ సెంటర్లలో కార్డుల నవీకరణ కోసం ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం రూ.100, డెమొగ్రాఫిక్ అప్‌డేట్ కోసం రూ.50, ఆధార్ డౌన్‌లోడ్, కలర్ ప్రింట్‌కు రూ.30 వసూలు చేయాల్సి ఉండగా.. అమాయకుల నుంచి అందిన మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. చేవెళ్లలో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ప్రజల నుంచి డబ్బులు అధికంగా వసూళ్లు చేస్తున్నట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి. ఒక్కొక్కరి వద్ద రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆధార్ మెయిన్ బ్రాంచ్ నుంచి పరిచయాలు ఉండటంతో.. ప్రైవేట్ వ్యక్తులకు లింకులు ఇస్తున్నారని, వారు అధికంగా డబ్బులు వసూలు చేసి ఆధార్‌ను అప్‌డేట్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేవెళ్ల ఒక్కటే కాకుండా మిగతా ఆధార్ సెంటర్ల వద్ద ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఆధార్ సెంటర్ల నిర్వాహకులు డబ్బులు తీసుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమతామూర్తి స్ఫూర్తి కేంద్రానికి..
మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు

శంషాబాద్ రూరల్, జనవరి 8: రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని తెలంగాణ మాజీ గవర్నర్ ఎస్ఎల్ నరసింహన్ దంపతులు సందర్శించారు. ఈసందర్భంగా వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ రామానుజాచార్యుల స్వర్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిజీ కుటీరంలో చిన జీయర్‌స్వామిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా స్వామిజీ వారికి మంగళశాసనములు అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. నరసింహన్ దంపతులకు చిన జీయర్ శాలువాలు కప్పి సత్కరించారు. కాగా, జీయర్ ఆశీస్సులు తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని నరసింహన్ వ్యాఖ్యానించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రత్యేక కాన్వాయ్‌లో మాజీ గవర్నర్ దంపతులు అక్కడి నుంచి బయలుదేరి వెళ్లిపోయారు.



నరసింహన్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న చినజీయర్‌స్వామి

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

» జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 9 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, డీఆర్వో సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో 140 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.



సమస్యలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్లు

» అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడంతోనే ప్రమాదాలు
» సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కనిపించని హెచ్చరిక బోర్డులు
» సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు
» రోడ్డు ప్రమాదాలతో వీధిన పడుతున్న కుటుంబాలు

రక్తమోడుతున్న సాగర్ రహదారి



తమ్మలోనిగూడ గేటు వద్ద చెట్టును ఢీకొన్న కారు(ఫైల్)

యాచారం, జనవరి 8 : హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారిపై వాహనాదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి అతివేగంగా వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ రహదారిపై ఏనాడూ ఆర్టీఏ అధికారులు వాహనాలు తనిఖీ చేసిన పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు నడుస్తున్నాయి. వివిధ రకాల వాహనాల డ్రైవర్లు సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ వాహనాలు నడపడంతో పాటు చాలాచోట్ల ప్రమాద సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదాలు ఇలా..

యాచారం మండల కేంద్రంలోని డీఎస్ఆర్ గార్డెన్ ఎదుట ఇన్నోవా డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో మొండిగౌరెల్లికి చెందిన కట్టెల నాని(17) తల పగిలి దుర్మరణం పాలయ్యారు, ఇదే ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కట్టెల నాని(18), కట్టెల సన్నీ(17), మనోహర్(16)లు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే ప్రదేశంలో రోడ్డు దాటుతున్న శ్రీ శైలం(55)ను దేవరకొండ ఆర్టీసీ డిపో బస్సు ఢీ కొట్టడంతో మరణించాడు. శ్రీశైలం మరణంతో అతనిపై ఆధారపడిన కుటుంబం నేడు అనాథగా మారింది. అదేవిధంగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్‌ఖాన్‌పేట వద్ద అశోక్(28) బైక్ స్కిడ్ కావడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ టవర్‌ను ఢీ కొట్టాడు. దాంతో బైక్ దగ్ధమై అశోక్ దుర్మరణం పాలయ్యాడు. మరో ఘటనలో చింతపట్ల గేటు వద్ద బైక్ బోల్తా పడడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వనపల్లి గ్రామానికి చెందిన కాదాసు సాగర్ (20) దుర్మరణం చెందాడు. నల్లగొండ జిల్లా పెద్దవూర గ్రామానికి చెందిన భవానీ ప్రసాద్(25) తీవ్రంగా గాయపడ్డాడు. తమ్మలోనిగూడ గేటు వద్ద రెండు లారీలు ఢీ కొనడంతో పత్తి లోడ్‌తో ఉన్న లారీ డ్రైవర్ నిలాడాకర్ దత్తు(22), గ్రానైట్ లారీ డ్రైవర్ ఆజాద్(28)లు దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో రెండు లారీల క్లీనర్లు రాహుల్, ఆసిఫ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. మాల్‌లో రోడ్డు దాటుతుండగా మాడ్గుల మండలం కొల్కులపల్లికి చెందిన పడాల మల్లయ్య(45) దుర్మరణం పాలయ్యారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామానికి చెందిన మహేష్(23) రెండేళ్ల క్రితం బైక్‌పై తన స్వగ్రామానికి వెళుతుండగా గడ్డమల్లాయగూడ వద్ద కారు ఢీ కొట్టడంతో దుర్మరణం చెందారు. నక్కగుట్ట తండా వద్ద నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సపావట్‌రాజు (25)ను కారు ఢీకొట్టడంతో దుర్మరణం చెందారు. ఇటీవల ఇబ్రహీంపట్నంలో స్కూటీపై వెళుతుండగా నజ్దిక్‌సింగారానికి చెందిన దార నర్సింహ దుర్మరణం చెందారు. మాల్ మర్రిగూడ రహదారిపై ఇటీవల కారు అతివేగంతో వెళ్లి రోడ్డు పక్కన గల చెట్టును ఢీ కొట్టడంతో దంపతులు మరణించారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం ఇంజమూరు గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీక్ (28) హైదరాబాద్ నుంచి కారులో చింతపల్లి మండల కేంద్రానికి వస్తూ తమ్మలోనిగూడ గేటు వద్ద చెట్టును ఢీ కొట్టడంతో అతడు దుర్మరణం చెందాడు. ఇతను లండన్‌లో ఎంఎస్‌సీ చదువుతున్నాడు. తమ్మలోనిగూడ గేటు వద్ద పొట్టు లారీని వెనకాల నుంచి వేగంగా వచ్చిన కారు లారీ కిందకు దూసుకుపోవడంతో నేనావత్ వెంకటేష్(27), నేనావత్ అనిల్ (17)లు కారులో ఇరుక్కుపోయి అక్కడికక్కడే చనిపోయారు. మృతులు నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని గన్యనాయక్‌తండా వాసులు. గత ఏడాది మాల్‌లో బైక్‌ను లారీ ఢీకొట్టడంతో విజయ్(25 దుర్మరణం చెందడంతో అతనిపై ఆధారపడిన కుటుంబం దిక్కులేక ఇబ్బంది పడుతోంది. ఈనెల 5న మాల్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో నందివనపర్తికి చెందిన రాంరెడ్డి దుర్మరణం చెందారు. ఈ నెల 7న రాత్రి బైక్‌పై ఇబ్రహీంపట్నం నుంచి యాచారం వస్తున్న రహీం, శివకుమార్‌లను కారు ఢీ కొట్టడంతో వారిద్దరూ దుర్మరణం చెందారు. ఈ నెల 7వ తేదీన రాత్రి గురునానక్ కళాశాల ఎదుట బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో వారిద్దరూ మరణించారు.

హైదరాబాద్-సాగర్ రహదారిపై ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	58	17	70
2021	68	23	54
2022	84	19	119
2023	72	30	52
2024	03	03	00
(జనవరి 8నాటికి)			



సాగర్ ప్రధాన రహదారి తమ్మలోనిగూడ గేటు వద్ద ఢీ కొన్న రెండు లారీలు (ఫైల్)

పూట గడవక ఇబ్బంది పడుతున్నాం



నా భర్త అశోక్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో నేడు పూట గడవక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నాం. సెంటు భూమి లేదు. దాతలు ముందుకు వచ్చి నా కుటుంబానికి ఆర్థిక సాయమందించి ఆదుకుంటే వారి మేలు మరువలేను.

- సంపూర్ణ, గృహిణి, కుర్మిద్ద

ముగ్గురిని ఎలా బతికించుకోవాలో..



నా భర్త రెండేళ్ల క్రితం ఇబ్రహీంపట్నంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మాకు ఇద్దరు పాపలు, ఓ బాబు ఉన్నాడు. వారిని ఎలా బతికించుకోవాలో తోచడం లేదు. బాబుకు దాతలు ముందుకు వచ్చి ఏదేని కంపెనీలో చిరు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని వేడుకుంటున్న.

- పద్మమ్మ, గృహిణి, నజ్దిక్‌సింగారం

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాం



సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఏ వాహన డ్రైవరైనా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటాం. మద్యం తాగి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరుగుతాయనే విషయం గమనించాలి. డ్రైవింగ్, ఆర్టీఏ పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా చర్యలు తప్పవు.

- సైదయ్య, యాచారం ఇన్‌స్పెక్టర్

జాతీయస్థాయి కరాటే పోటీల్లో తాండూరు విద్యార్థుల ప్రతిభ


మెడల్స్ సాధించిన తాండూరుకు చెందిన విద్యార్థులు

తాండూరు, జనవరి 8: షాద్‌నగర్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తాండూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఓపెన్ చాంపియన్‌షిప్‌లో సీనియర్ మాస్టర్ మోహన్ కృష్ణ బృందం తాండూరు నుంచి పోటీల్లో పాల్గొన్నారు. బ్లాక్ బెల్ట్ విద్యార్థులు హర్షిత్, మణికంఠ, హన్సికలు గ్రాండ్ చాంపియన్ కప్‌లను సాధించారు. నంద కిషోర్, రేవంత్, పల్లవి, మణికంఠ, బంగారు పతకాలను, రాకేష్, ఆకాష్, ప్రవీణ్‌కుమార్, శివకుమార్, అనుదీప్‌రెడ్డి వెండి పతకాలు సాధించారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ


విజేతగా నిలిచిన ఎండీ అన్వర్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8: మర్రిపల్లి గూడకు చెందిన మహ్మద్ అన్వర్ సీనియర్ బాడీబిల్డింగ్ మెన్స్ ఫిసిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచాడు. హైదరాబాద్, గచ్చిబౌలి ఎంఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి జరిగిన బాడీబిల్డింగ్ 95కిలోల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి చాంపియన్ ఆఫ్ చాంపియన్‌గా నలిచాడు. దీంతో అన్వర్‌ను తోటి బాడీబిల్డర్లు, గ్రామస్తులు అభినందించారు.

సహకార అధికారుల డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 8: జిల్లా సహకార అధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం డైరీని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రెయినీ కలెక్టర్ అమిత్ నారాయణ్, జిల్లా సహకార అధికారి శంకరాచారి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, సంబంధిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిగిలో ఇస్తేమాకు తరలిన ముస్లింలు


సభాస్థలి వద్ద జనసందోహం

నవాబుపేట, జనవరి 8: పరిగి పట్టణ శివారులో మూడు రోజులుగా జరిగిన ఇస్తేమా కార్యక్రమానికి నవాబుపేట మండలంతో పాటు పరిసర గ్రామాల ముస్లిం సోదరులు భారీగా తరలి వెళ్లారు. చివరి రోజు సోమవారం వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. దాదాపు 200 ఎకరాల్లో నిర్వహించిన ఇస్తేమా కార్యక్రమానికి దేశవిదేశాల నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు భారీగా తరలిరావడంతో ఎటు చూసినా జనసందోహమే కనిపించింది. ఇజ్తిమా కార్యక్రమంలో ఇస్లాం మతపెద్దల బోధనలను ముస్లిం సోదరులు శ్రద్ధగా విన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, జనవరి 8: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఎంతగానో మేలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. కొడంగల్ క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని 14 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న వారికి సీఎం రేవంత్‌రెడ్డి చేదోడు, వాదోడుగా ఉంటారని తెలిపారు.

ఆలేరు ఎమ్మెల్యేకు సన్మానం


ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కురుమ సంఘం జిల్లా నాయకులు

కొడంగల్ రూరల్, జనవరి 8: ఆలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన బీర్ల ఐలయ్యను తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ కురుమ సంఘం కార్యాలయంలో సన్మానించారు. కురుమ సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.నాగప్ప తదితరులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమ గొల్ల కాపరుల సమస్యల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు.

ఆసరా పింఛన్ల కోసం ఆందోళన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ, తహసీల్దార్

కులకచర్ల, జనవరి 8: చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మందిపాల్ గ్రామ పింఛన్ లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. తపాల అధికారి పింఛన్ డబ్బులు ఇవ్వడం లేదని ఆదివారం సాయంత్రం సర్పంచ్ మఠం ప్రమీల ఇంటి వద్ద బైఠాయించిన విషయం తెలిసిందే. అయితే, చౌడాపూర్ తపాల అధికారి మందిపాల్‌లో పింఛన్ పంపిణీ చేయాల్సి ఉండగా, మిషన్ పని చేయడంలేదని, బ్యాంకులో డబ్బులు లేవని పలుసాకులు చెబుతూ ఐదు రోజులుగా పింఛన్ డబ్బులు పంపిణీ చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ రాందాస్‌నాయక్, తహసీల్దార్ ప్రభు కార్యాలయానికి చేరుకున్నారు. తపాల ఉన్నతాధికారులతో మాట్లాడతామని మంగళవారం నుంచి గ్రామంలో తపాలా అధికారి పింఛన్ డబ్బులు పంపిణీచేసే విధంగా చర్యలు తీసుకుంటాని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా రేణుకారెడ్డి


రేణుకారెడ్డి

బషీరాబాద్, జనవరి 8: బషీరాబాద్ మండలం మైల్వార్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా రేణుకారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ధారూరు మండల బీట్ ఆఫీసర్‌గా ఉన్న ఆమె ఇక్కడికి బదిలీపై వచ్చారు. అడవుల సంరక్షణకు ఎప్పటికప్పుడూ తగిన చర్యలు తీసుకుంటానన్నారు.



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఓంశాంతి కేంద్రం నిర్వాహకురాలు మధు అక్కయ్య

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

వికారాబాద్, జనవరి 8: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం రాత్రి ఓంశాంతి కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రం నిర్వాహకురాలు బ్రహ్మకుమారి మధు అక్కయ్య స్పీకర్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఓంశాంతి కేంద్రం సేవలను అడిగి తెలుసుకున్నారు. మానసికంగా, శారీరకంగా పటిష్టంగా మారేందుకు యోగా, ధ్యానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎ.సుధాకర్‌రెడ్డి, శివారెడ్డిపేట సొసైటీ మాజీ చైర్మన్ ఎన్.కిషన్‌నాయక్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, సదానందం, పాల్గొన్నారు.

18మంది బాల కార్మికులకు విముక్తి

తాండూరు రూరల్, జనవరి 8: ఆపరేషన్ స్మైల్-10లో భాగంగా తాండూరు పట్టణంలోని వివిధ చోట్ల పనిచేస్తున్న 18మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు బాలల రక్షణ కమిటీ అధ్యక్షుడు వెంకటేశం తెలిపారు. ఈనెలాఖరు వరకు బాల కార్మికుల విముక్తి కోసం ఆపరేషన్-10లో ప్రత్యేక దాడులు నిర్వహించి యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరూ ప్రైవేట్ దుకాణాల యజమానులు కానీ, చిన్నపరిశ్రమల యజమానులు కానీ 18ఏళ్లలోపు ఉన్న వారికి పనుల్లో పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఆపరేషన్-1ఏలో కార్మిక శాఖ అధికారులతో పోలీసుల సహకారం తీసుకుని ముగ్గురు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి, బాలల రక్షణ కమిటీ ప్రతినిధి నరేష్‌కుమార్, లీగల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై గరం గరం

- సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయండి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, జనవరి 8: మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశంలో గ్రామ సమస్యలపై మొరపెట్టుకోవడమే తప్పా పరిష్కారం లభించడంలేదని వివిధ శాఖల అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వెళ్లగక్కారు. ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యుత్ అంశంపై చర్చకు రాగా సభ్యులు ఒక్కసారిగా పైకిలేచి ఏఈతో కరెంట్ సమస్యలపై ఏకరువు పెట్టారు. ఇళ్ల, పాఠశాలపై కరెంట్ తీగాలు వెలాడుతున్నాయని మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని సర్పంచులు రథోడ్ సునీత, దశరథ్, గోళ్లభీమప్ప, శ్రీధర్ తదితరులు ఏఈపై మండిపడ్డారు. అదేవిధంగా ఏఎన్ఎం, ఆశావర్కర్లు అందుబాటులో ఉండడంలేదని, మాసన్‌పల్లి సర్పంచ్ గోళ్లభీమప్ప సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు సక్రమంగా ఉండటంలేదని ఆయా గ్రామాల సర్పంచులు సూర్య, పద్మచందర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్అండ్‌బీ శాఖ అంశంపై చర్చకు రాగా వర్క్ ఇన్‌స్పెక్టర్ సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆరాతీశారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో రమేష్‌ను ఆదేశించారు. అదేవిధంగా పర్వానాయక్ తండా సర్పంచ్ తమ గ్రామంలో బీటిరోడ్డు వేయాలని కోరారు. కొర్విచెడ్ సర్పంచ్ శోభారాణి పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరై ఏళ్ల గడుస్తున్నా ఇంకా బేస్‌మెంట్ వద్దే పనులు నిలిచిపోయాయని తెలిపారు. కొత్లాపూర్‌లో 300ఎకరాల ప్రభుత్వ భూమి అటవీ, రెవెన్యూ శాఖల్లో ఎవరి ఆధీనంలోఓ ఉందో తేల్చాలని జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్, జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ శాంతాబాయిరామునాయక్, వైస్‌ఎంపీపీ జడల అన్నపూర్ణ, తహసీల్దార్ ఎన్.వెంకటస్వామి, ఎంపీడీవో రమేష్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బషీరాబాద్ రూపురేఖలు మారుస్తా: ఎమ్మెల్యే

సీఎం సాయంతో బషీరాబాద్ మండల రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బషీరాబాద్ సర్వసభ్య సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు ఎప్పటికప్పుడూ గ్రామాలను సందర్శిస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రతీ గ్రామంలో తిరిగానని, ప్రజలసమస్యలపై పూర్తిగా అవగాహన ఉన్నందున పరిష్కారానికి ప్రత్యేక దృష్టిపెడతానన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

గత ప్రభుత్వం జారీ చేసిన జివోలు చిత్తుకాగితాలు

తాండూరు: గత ప్రభుత్వంలో జారీ చేసిన జివోలన్నీ చిత్తు కాగితాలేనని నిధులు లేకుండా జీవోలు జారీ చేశారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పనులకు సంబంధించి రూ.500 కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రజాపాలనలో అధికారులు పనితీరు భేషుగ్గా ఉందన్నారు. ప్రజాపాలనలో 73,918 దరఖాస్తులు వచ్చాయని అందులో 23000 డేటా ఎంట్రీ పూర్తి చేసినట్లు తెలిపారు. తాండూరుకు రెండు రోజుల్లో మరో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉంటుందని మనోహర్‌రెడ్డి జోస్యం చెప్పారు. తాండూరులో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి రూ.33కోట్ల నిధులు అవసరమవుతాయని తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటామన్నారు. మన్నెగూడ నుంచి తాండూరు వరకు ఫోర్‌లైన్ రోడ్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా తాండూరులో బైపాస్ రోడ్డుపనులకు ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రవిగౌడ్, సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, నీరజ బాల్‌రెడ్డి, బోయ రవిరాజ్, పెద్దేముల్ వైస్ ఎంపీపీ మధులత తదితరులు ఉన్నారు.

ఎంపీపీ జన్మదిన వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే

బషీరాబాద్: బషీరాబాద్ ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ పార్టీ శ్రేణుల మధ్యన జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరై ఎంపీపీ దంపతులకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి శోభారాణి దంపతులు ఎంపీపీకి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై ఎంపీపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

శంషాబాద్, జనవరి 8 : మున్సిపల్ కేంద్రంలోని రాళ్లగూడబస్తీలో గల జోషికుంట ప్రాంతంలో అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టిన ఓ కట్టడాన్ని సోమవారం ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. రాళ్లగూడ జోషికుంట పక్కనే ఉన్న ఔటర్‌రింగురోడ్డు పక్కన గల సర్వీసు రోడ్డు ప్రాంతంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మట్టి పోయించి చెరువుకు చెందిన భూమిని ఆక్రమించుకొని ఓ గోడ కూడా నిర్మించారు. విషయం తెలుసుకున్న అధికారులు కూల్చివేశారు.





కడ్తాలలో పథకాల గురించి వివరిస్తున్న తహసీల్దార్ ముంతాజ్

పథకాలపై చెంచులకు అవగాహన

ఆమనగల్లు, జనవరి 8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై చెంచులకు అధికారులు అవగాహన కల్పించారు. ఆమనగల్లు పట్టణంతో పాటు శంకర్ కొండ తండాకు చెందిన చెంచులకు సోమవారం మండలంలోని వివిధ శాఖల అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఎం జన జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్ పథకం అమలులో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. ప్రధానంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, రైతు బరోసా, రైతు బీమా పథకాల గురించి మండల వ్యవసాయ శాఖ అధికారిణి అరుణ కుమారి వివరించారు. ఆయా పథకాలు రానివారు, ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఓటర్ కార్డు, లేని వారు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. చెంచుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది వారికి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఏఈవోలు శివతేజ, సాయిరామ్, గిరిజన సంక్షేమ అధికారి నయీమోద్దీన్, మెడికల్ ఆఫీసర్, డాక్టర్ పరిక్షిత్, ఎంపీహెచ్ఈవో తిరుపతిరెడ్డి, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ శంకర్, చెంచు సేవా సంఘం రాష్ట్ర నాయకుడు నల్లబోతుల జంగయ్య, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కడ్తాల మండల కేంద్రంలోని 2వ వార్డు చెంచుకాలనీలో జన్‌మాన్ అభియాన్ పథకం గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాలు అందని వారు, వివిధ కార్డులు లేని వారిని అధికారులు గుర్తించారు. తహసీల్దార్ ముంతాజ్, సీడీపీవో సక్కుబాయి, ఏవో శ్రీలత, సూపర్ వైజర్ శబరి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు నరేందర్ రెడ్డి, రాంచంద్రయ్య, మల్లేశ్‌గౌడ్, మల్లయ్య, శ్రీను, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

మంచు కాదు.. పొగే



మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్‌లో ప్రదాన రోడ్డుపై పొగ

మొయినాబాద్ రూరల్, జనవరి 8 : ఈ చిత్రాన్ని చూస్తుంటే తెల్లవారుజామున పొగ మంచు కురుస్తుండగా ఆహ్లాదకరమైన వాతవరణంలో వాహనదారులు ప్రయాణిస్తున్నట్లుంది కదా.. కానీ అది పొగ మంచు కాదు. పొగమాత్రమే. సోమవారం హిమాయత్ నగర్ గ్రామం నుంచి చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రదాన రహదారిలో చెత్త వ్యర్థాలను హిమయత్ నగర్ గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా రోడ్డు పక్కనే కాల్చడంతో ఏర్పడిన పొగ. అది రహదారిపై వ్యాపించడంతో వాహనదారులు ఇబ్బందికరంగా ప్రయాణించారు. ఇలా రోడ్డు పక్కన చెత్తను కాల్చవద్దని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

సృజనాత్మక కళలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థుల కళా ప్రదర్శన

షాద్‌నగర్‌రూరల్, జనవరి 8: ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల కళాశాల విద్యార్థినులు సృజనాత్మక కళలో ప్రతిభ కనబరిచారు. జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో సృజనాత్మక కళలపై పోటీలు నిర్వహించారు. జన్య ఫౌండేషన్, బ్రిస్టల్ ఆధ్వర్యంలో సమకూర్చిన బోధన, అభ్యాసన పరికరాల ద్వారా తరగతి గదిలో కృత్యముల ద్వారా నేర్చుకున్న సైన్స్, గణితంలోని అంశాలను విద్యార్థినులు ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. వేస్ట్ మేనేజ్‌మెంట్, వాటర్ కన్జర్వేషన్, హెల్త్ అండ్ వెల్ బీయింగ్, సోలార్ ఎనర్జీ అనే అంశాలపై జన్య ఫౌండేషన్, బ్రిస్టల్ ప్రతినిధులు పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యులత, జన్య కో-ఆర్డినేటర్ యాదయ్య, అధ్యాపకులు హేమలత, శిరీష పాల్గొన్నారు.



కొండారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 10ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

10ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కేశంపేట, జనవరి 8: మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఎన్నికల ముందు హడావిడిగా 33/11 కేవీఏ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి.. ఒక్క రోజులోనే 10ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని తొలగించారు. దాంతో సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ జనవరి 5న 'ఆంధ్రజ్యోతి' రంగారెడ్డి జిల్లా ఎడిషన్‌లో ఏక్ దిన్ కా సబ్‌స్టేషన్ అనే శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి మూడు రోజుల్లో సబ్‌స్టేషన్‌లో 10ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. సర్వీసు ఫీడర్లను పునరుద్ధరించారు. ప్రస్తుతం కొండారెడ్డిపల్లి రైతాంగానికి, గృహ అవసరాల నిమిత్తం 24గంటల ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. అలాగే చింతకుంపల్లి, పోమాల్‌పల్లి గ్రామాలకు వ్యవసాయానికి సర్వీసు ఫీడర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా ప్రారంభించారు. సబ్‌స్టేషన్ ప్రారంభం కావడానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, చింతకుంటపల్లి గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. పనులు శరవేగంగా చేయించిన కేశంపేట ఏఈ ఈశ్వర్‌ను అభినందించారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

- రైల్వేకార్మికుల రిలే నిరాహార దీక్షలు



ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న రైల్వే కార్మికులు

ఘట్‌కేసర్, జనవరి 8: నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విదానాన్ని పునరుద్దరించాలని డిమాండ్‌చేస్తూ సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘట్‌కేసర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో కార్మిక నాయకులు మాట్లాడుతూ రైల్వేసేఫ్టీ కేటగిరిలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ట్రాక్‌మెన్‌లకు నైట్ పెట్రోలింగ్ డ్యూటీలో ఇద్దరిని కేటాయించాలన్నారు. కార్మికులకు అదనపు పనిభారాన్ని తగ్గించాలని సూచించారు. రైల్వే ప్రవేటీకరణను విరమించాలని డిమాండ్ చేశారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ రైల్వే శాఖలో అనేక విభాగాల్లో 12గంటల చొప్పున పని చేయిస్తూ శ్రమదోపిడికి పాల్పడుతున్నరని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మె చేయడానికి వెనుకాడేదిలేదని హెచ్చరించారు. ఈదీక్షలు ఈనెల 11వరకు కొనసాగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో బొల్లేపల్లి శ్రీనివాస్, వై.వెంకటేశ్వర్లు, హరికృష్ణ, దిలీప్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, అన్నపూర్ణ, కిరణ్, మల్లేష్, రవి, బాబు, భాస్కర్, అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న రైల్వే యూనియన్ కార్మికులు

తాండూరు రూరల్: రైల్వే కార్మికులు సోమవారం తాండూరు రైల్వే స్టేషన్ వద్ద వేర్వేరుగా నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రైల్వే మెన్, సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, ఎన్ఎఫ్ఐఆర్ పిలుపు మేరకు తాండూరు రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ తాండూరు బ్రాంచ్ సెక్రెటరీ పాశం లక్ష్మీనారాయణ, మజ్దూర్ యూనియన్ తాండూరు బ్రాంచ్ సెక్రెటరీ పి.కాళేశ్వర్, చైర్మన్ దేవేందర్‌లు మాట్లాడుతూ పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెలలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు విడిగా 50శాతం పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రతీనెల 6వ తేదీన డీఏ కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో అభినవ్‌రెడ్డి, వాజిద్, జయరాజ్, రహీమ్, మనోజ్‌కుమార్, నర్సింహులు, రాంచౌహాన్, మల్లేష్, రాములు, రాహుల్ రాథోడ్, అరుణ్ చౌరి తదితరులు పాల్గొన్నారు.



తీర్మాన ప్రతిని అందజేస్తున్న కౌన్సిలర్లు

'పట్నం' చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం?

ఇబ్రహీంపట్నం, జనవరి 8: ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిపై తోటి కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు అవిశ్వాస తీర్మాన ప్రతిని అందజేశారు. చైర్‌పర్సన్ స్రవంతి సహా మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి సహా 17 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకాలు చేశారు. వీరిలో బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లు ఉన్నారు. కాగా అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 6, బీజేపీ నుంచి ఇద్దరు కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. గతేడాది కూడా చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్‌కు తీర్మాన ప్రతిని అందజేశారు. అది పెండింగ్‌లో ఉంది. చైర్‌పర్సన్ స్రవంతి, కౌన్సిలర్లు ఇందిరాల రమేష్, బర్ల మంగ అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు పి శంకరయ్య, మోహన్‌నాయక్, నరాల విశాల బీఆర్ఎస్‌లో చేరారు. అయినప్పటికీ కౌన్సిల్‌లో బీఆర్ఎస్‌కు 16, బీజేపీకి ఇద్దరు, కాంగ్రెస్‌కు 6గురు కౌన్సిలర్‌లు ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో మరోమారు అవిశ్వాసం వ్యవహారం తెరపైకి వచ్చింది. కాగా నాలుగు రోజుల క్రితం ఆదిబట్ల మున్సిపాలిటీలో కాంగ్రెస్ చైర్‌పర్సన్ ఆర్తిక, వైస్ చైర్మన్ కళమ్మ (బీఆర్ఎస్)పై కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా బీజేపీ కౌన్సిలర్ ఒకరు అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకాలుచేసి కలెక్టరేట్‌లో అందజేసిన విషయం తెలిసిందే. ఈ రెండు మున్సిపాలిటీల విషయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అవిశ్వాస తీర్మానాలపై రెండు మున్సిపాలిటీల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, జనవరి 8 : మండల పరిధిలోని చిన్నగోల్కొండలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సీసీ రోడ్ల పనులను సర్పంచ్ పద్మావతిఅనంతరెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. రూ.28లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ తన్వీరాజు, వైస్ ఎంపీపీ నీలంనాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటుకు వినతి

తలకొండపల్లి, జనవరి 8: మండల కేంద్రంలో ఆదార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఉపసర్పంచ్ పద్మ అనిల్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆధార్ నమోదు కోసం రెండు, మూడుసార్లు కల్వకుర్తి, వెల్దండ, మిడ్జిల్, ఊరుకొండ మండలాలకు వెళ్లాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. నాయకులు వెంకటేశ్, కుమార్, రాజశేఖర్, పరమేశ్, ఆనంద్, మధు, తదితరులు ఉన్నారు.

నేదునూరు మాజీ సర్పంచ్‌కు నివాళి

కందుకూరు, జనవరి 8 : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నేదునూరు మాజీ సర్పంచ్ బద్దుల మల్లయ్య చిత్రపటానికి కాంగ్రెస్ మైనారిటీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అఫ్జల్‌బేగ్, ఆ పార్టీ నేతలు నివాళులర్పించారు. మల్లయ్య దశదిన కార్యక్రమం సోమవారం గ్రామంలో జరిగింది. గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎన్.నర్సింహ, వి.బాబు, ఎగిరిశెట్టి నర్సింహ, మహిపాల్‌రెడ్డి, హనుమంత్‌నాయక్, బాలకృష్ణ, వెంకట్ రెడ్డి, ఉన్ని వెంకటయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో
మంచిరెడ్డిని అరెస్ట్ చేయొద్దు: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అరెస్ట్ చేయరాదని హైకోర్టు ఇబ్రహీంపట్నం పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. మాజీ ఎమ్మెల్యే తనను దూషించారని పేర్కొంటూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కె. స్రవంతి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలని కిషన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం.. ఈ కేసులో కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం లేదని తెలిపింది. అందువల్ల ఆయనను అరెస్ట్ చేయరాదని పేర్కొంది. చట్టప్రకారం పోలీసులు దర్యాప్తు చేయాలని సూచిస్తూ విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : వీర్లపల్లి

● లాలాపేట్‌లో జీపీ భవనం ప్రారంభం

కొందుర్గు, జనవరి, 8 :పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని లాలాపేట్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోనియాగాంధీ ఆధ్వర్యంలోనే ఉపాధి హామీ పథకం రూపకల్పన జరిగిందని, ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఉపాధి లభిస్తోందన్నారు. ఈ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనానికి రూ.20లక్షలు మంజూరైనట్లు చెప్పారు. లాలాపేట్ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గతంలో గ్రామానికి వచ్చిన సమయంలో గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఉమ్మెంత్యాల-లాలాపేట్ మధ్యలో వంతెన నిర్మాణం చేయించాలని గ్రామస్థులు అడిగారని తెలిపారు. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల ముందుగా వంతెనను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను సందర్శించి, శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నూతన భవనం కోసం కృషి చేస్తానని అన్నారు. సర్పంచ్ రాంరెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీడీవో అంజనేయులు, తహసీల్దార్ రమేష్ కుమార్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, తదితరులున్నారు.



కొత్తూర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

జేపీ దర్గా ఉర్సు ఉత్సవాలకు ఏర్పాట్లు

కొత్తూర్ : సంక్రాంతి తర్వాత నిర్వహించబోయే జేపీ దర్గా ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి అధికారులకు ఆదేశించారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ శివారులో గల హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా ఆవరణలోని కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉర్సు ఉత్సవాల సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా శంకర్ పాల్గొని మాట్లాడారు. జేపీ దర్గా ఉత్సవాలకు భక్తులు భారీసంఖ్యలో వస్తారన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం కారణంగా మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, మరుగుదొడ్లు, మొబైల్ మరుగుదొడ్లు, మంచినీరు, వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ నుంచి ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఆర్టీసీ బస్సుల ట్రిప్పులను పెంచాలని డీఎంకు సూచించారు. పార్కింగ్ స్థలాలు సిద్ధం చేయాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. భక్తుల కోసం 50వేల వాటర్ బాటిళ్లను ఉచితంగా అందజేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవి కుమార్‌గుప్త, నాయకుడు ఖాజు, ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్రనాయక్, దర్గా సూపరింటెండెంట్ సత్తార్ తదితరులున్నారు.

డిగ్రీ కళాశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

షాద్‌నగర్ రూరల్ : షాద్‌నగర్ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. సోమవారం ఆయన కళాశాలను సందర్శించారు. అధ్యాపకులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కళాశాల కొత్త భవనంలోకి మారిన తర్వాత కూడా పలు సమస్యలు ఎదురవుతున్నాయని అధ్యాపకులు ఆయన దృష్టికి తెచ్చారు. అధ్యాపకులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ కమల, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

సమానత్వమే కాంగ్రెస్ ధ్యేయం



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జనవరి 8: అందరికీ స్వేచ్ఛ, సమానత్వమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. పక్షపాతం, రాజకీయాలకు తావులేకుండా ప్రజాపాలనలో అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడం జరుగుతుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కసిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. స్వార్థ ప్రయోజనాలకు తావులేకుండా ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ నెరవేరుస్తుందని తెలిపారు. పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీలు అనితవిజయ్, కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, విజయ్ కుమార్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు జగన్, బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మోతినాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా, మండలాల నాయకులున్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన



మాట్లాడుతున్న ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

ఆమనగల్లు, జనవరి 8: రాష్ట్రంలో కాంగ్రెస్ పారదర్శక పాలన అందిస్తూ ప్రజలకు మరింత చేరువైందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సేవకులమే తప్ప పాలకులం కాదన్న మాటను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకుంటున్నారని అన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి యాచారం వెంకటేశ్వర్లు గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నిజం చేస్తూ రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతుందన్నారు. అధికారం కోల్పోయామన్న అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించినట్లు మాట్లాడుతున్నారని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. గడీల, నియంత పాలన నుంచి తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లభించిందని, నెలరోజుల కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, కడ్తాల మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులున్నారు.

పేదరిక నిర్మూలనకు కేంద్రం కృషి



మహిళకు బీమా పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ సుకన్యబాషా, బొక్క నర్సింహారెడ్డి

యాచారం, జనవరి 8 : దేశంలో 2047 నాటికి పేదరికాన్ని నిర్మూలించడం కోసమే ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ సంకల్ప యాత్రను చేపట్టినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యాచారం ఎంపీపీ సుకన్యబాషా అన్నారు. సోమవారం మండలంలోని గున్‌గల్, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, మాల్, యాచారం గ్రామాల్లో యాత్రను ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు ప్రతాప్, వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, సర్పంచులు ఉదయశ్రీ, కె.ఇందిర, ఉపసర్పంచ్ భీమ్‌యాదవ్, మాజీ సర్పంచ్ ఆర్.విజయ్‌కుమార్, నాయకులున్నారు.

పేద విద్యార్థులకు చేయూత



కార్యక్రమంలో పాల్గొన్న నిరంజన్‌రెడ్డి, తదితరులు

మంచాల, జనవరి 8 : గ్రామీణ ప్రాంతాల్లోని పేదవిద్యార్థుల కోసం తమ ఫౌండేషన్ తరఫున సేవాకార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని పీసీసీ సభ్యుడు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జాపాల, ఆరుట్ల గ్రామాల విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్టడీమెటీరియల్‌ను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి, రావులబాష, మాదగోని జంగయ్యగౌడ్, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

● **కందుకూరు** : మాన్యగూడలోని నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరికి శాలివాహన వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. ఆ సంఘం మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బాలయ్య ఆధ్వర్యంలో మాన్యగూడకు చెందిన ఎగిరిశెట్టి రాజుకు రూ.21వేలు, ఎగిరిశెట్టి సుదర్శన్‌కు రూ.21వేలు సంఘం వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ ఎన్.నరేష్‌కుమార్, వైస్‌చైర్మన్ డి.రాజు చేతుల మీదుగా అందించారు.

● **కందుకూరు** : మండల కేంద్రంలోని ప్యాక్స్ (సహకార సంఘం) కార్యాలయంలో డైరక్టర్లతో కలిసి చైర్మన్ చంద్రశేఖర్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. డైరక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, నర్సింహ, జి.అంజమ్మ, తీగల జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ వెంకటరాంరెడ్డి, సాధ పాండురంగారెడ్డి, సంఘం సభ్యులు యాదగిరిరెడ్డి, రాములున్నారు.

● **షాబాద్** : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తమవంతు కృషి చేస్తున్నామని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. మండల కేంద్రంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల రైతు ఉత్పత్తి దారుల సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. రత్నాకర్ మాట్లాడుతూ రైతులు పంటల దిగుబడి పెంచడానికి, భూసార పరీక్షలతో పాటు, విత్తనాల ఎంపిక, సాగు చేసే విధానం, ఎరువుల వాడకం పద్ధతులను నేర్చుకోవాలన్నారు. పంటలకు తెగుళ్లు ఏర్పడినప్పుడు కృషి విజ్ఞాన కేంద్రం మరియు రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్ర వేత్తలు సలహాలు అందిస్తున్నారన్నారు. సుగుణమాల రైతు ఉత్పత్తి దారుల సంఘం మండల అధ్యక్షుడు లింగం, డైరెక్టర్లు యాదవరెడ్డి, వెంకటయ్య, రాజు, నర్సింహులు, శేఖర్, అంజయ్య పాల్గొన్నారు.

● **చేవెళ్ల** : స్వామి వివేకానంద అందరికీ ఆదర్శప్రాయుడని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వివేకాందనం జూనియర్ కళాశాలలో స్వామి వివేకాంద జయంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

● **మంచాల** : మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం ప్రతినిధులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి, వైస్‌చైర్మన్ యాదయ్య, డైరెక్టర్లు వేణుగోపాల్‌రావు, వెదిరి హన్మంత్‌రెడ్డి, దండేటికార్ సత్యనారాయణ, వింజమూరి రాంరెడ్డి, పి.రమేష్, సీనియర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు** : ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని మండల ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీడీవో వెంకట్రాములు, తహసీల్దార్ గోపాల్‌లు పాల్గొన్నారు.

● **షాబాద్** : అయోధ్యలో రామమందిర నిర్మాణంతో భారతదేశ ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతుందని పురోహితుడు శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రామాంజనేయ ఆలయంలో అయోధ్య అక్షింతలను గ్రామంలో పంపిణీ చేశారు.

శంషాబాద్ ఏసీపీకి సన్మానం



శంషాబాద్, జనవరి 8 : శంషాబాద్ ఏసీపీ రాంచంద్రరావును మాజీ ఎమ్మెల్యే శంకర్‌రావు సోమవారం సాయంత్రం కలిసి సన్మానించారు. ఈమేరకు ఆయన కార్యాలయంలో కలసి పూలబొకే అందజేశారు. శంకర్‌రావు మాట్లాడుతూ ఏసీపీ రాంచంద్రరావు మంచి అధికారి అని, ఇక్కడ పనిచేస్తున్నాడని తెలిసి మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చినట్లు తెలిపారు.

సీపీఐని మరింత బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల, జనవరి 8: నియోజకవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ, అనుబంధ ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో సీపీఐ నియోజకవర్గ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ ఏర్పడి 99 ఏళ్లవుతుందని, దేశంలో పేదల కోసం నిరంతరం అండగా ఉండి పోరాటం చేస్తోందన్నారు. ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్ గౌడ్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల ప్రధాన కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, జంగయ్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

మల్లన్న స్వామిని
దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే



పూజలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్, జనవరి 8: చేవెళ్ల మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలోని భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మూడు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దేవాలయం ప్రాంగణంలో పటం తొక్కుట, స్వామి వారిని చిలూకూరి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఎంపీ, ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశ్ సన్మానించారు. అంతకుముందు వారు మండల పరిషత్ కార్యాలయంలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీ, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంపీపీ నక్షత్రం, జడ్పీటీసీ శ్రీకాంత్, ఎంపీడీవో సంధ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

దైవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

ఆమనగల్లు, జనవరి 8: దైవ కార్యక్రమాల్లో ప్రతీఒక్కరు పాలుపంచుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు, ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి కోరారు. జిల్లెల్ల, ఎంగంపల్లి పోచమ్మ దేవాలయాల్లో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.1.40 లక్షలు విరాళం అందజేసినందుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ జంగయ్య, ఎంపీటీసీ శోభశేఖర్‌రెడ్డి, నాయకులు అనిల్ గౌడ్, బాల్‌రాజ్, శ్రీకాంత్ రెడ్డి, రవి, వీరయ్య, మల్లయ్య, శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీహరి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, జనవరి 8: చీపునుంతలకు చెందిన పోశయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం జడ్పీటీసీ వెంకటేశ్ పరామర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతుని కుటుంబానికి రూ.3వేలు సమకూర్చగా నాయకులు అందజేశారు. జనార్దన్ రెడ్డి, బాలకుమార్ గౌడ్, గిరి, బ్రహ్మాచారి, చెన్నకేశవులు, జంగయ్య, చెన్నారెడ్డి, తదితరులున్నారు.

క్రైం కార్నర్

కాలిన స్థితిలో
గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యం

మొయినాబాద్, జనవరి 8 : గుర్తుతెలియని వ్యక్తులు ఓ యువతిని హత్యచేసి తగులబెట్టారు. ఈ ఘటన మండల పరిధిలోని బాకారం పరిసరాల్లో చోటుచేసుకుంది. సుమారు 20 నుంచి 25 సంవత్సరాల గుర్తుతెలియని యువతిని హత్య చేసినట్లుగా తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలంలోని బాకారం సమీపంలో సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన రైతులు కొంతమంది రోడ్డు పక్కన కాలుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చిన సమయానికి కూడా యువతి మృతదేహం కాలుతూనే ఉంది. రైతుల సహాయంతో నీళ్లపోసి మంటలు ఆర్పారు. కాగా, గుర్తుతెలియని వ్యక్తులు యువతిని వేరేచోట హత్యచేసి ఇక్కడికి తీసుకొచ్చి పెట్రోల్ పోసి తగులబెట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం పక్కన సగం కాలిన సెల్‌ఫోన్ లభ్యమైంది. శరీరం 80 శాతం కాలినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి సందర్శించారు. క్లూస్‌టీం సహాయంతో వివరాలు సేకరిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. మూడు టీంలతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. రాజేంద్రనగర్ జోన్ అదనపు డీసీపీ రష్మీపెరుమాల్ పర్యవేక్షిస్తున్నారు. కాగా, మృతదేహం గుర్తుపట్టలేనంతగా కాలిపోయిందని, యువతి ఎవరనేది తెలుసుకోవడంతో పాటు నిందితులను సైతం పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు. ఈమేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరు దుర్మరణం

● ప్రమాద స్థలంలో ఒకరు.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు మృతి

● కారు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం : పోలీసులు

● రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధి సాగర్ రహదారిపై ఘటన



శివకుమార్, రహీమ్(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జనవరి 8 : బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం పరిధి నాగార్జునసాగర్ ప్రధాన రహదారిలో గల గురునానక్ కళాశాల సమీపంలో, జేబీ వెంచర్ ముందు బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన సిద్దగోని శివకుమార్(30), షేక్ రహీమ్(42)లు బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామం చింతపట్లకు వెళ్తున్నారు. ఆదివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో సాగర్ రహదారిపై జేబీ వెంచర్ ముందు ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దాంతో శివకుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రహీమ్‌ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, మృతులు నిరుపేద కుటుంబాలకు చెందినవారు. రహీమ్ నల్గొండ జిల్లా సూర్యాపేట మండలం నోముల గ్రామవాసి. పొట్టకూటి కోసం యాచారం మండలం చింతపట్లకు వలస వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను మహ్మద్ జునైద్‌గా పోలీసులు గుర్తించారు. అతడు టీవీ సీరియల్ నటుడని, అతివేగం, నిర్లక్ష్యంగా కారు నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారయ్య తెలిపారు.

భార్యను హతమార్చిన కేసులో
భర్తకు యావజ్జీవ కారాగారం

తలకొండపల్లి, జనవరి 8 : భార్యను హతమార్చిన కేసులో భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సోమవారం ఎల్‌బీ నగర్ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. రెండేళ్ల క్రితం జరిగిన ఘటనకు సంబంధించి సాక్ష్యాధారాలు నిరూపితం కావడంతో జిల్లా అదనపు న్యాయ మూర్తి హరీష శిక్ష విధించినట్లు తలకొండపల్లి ఎస్ఐ సీహెచ్ శ్రీను తెలిపారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కట్టుమల్ల జగన్ అలియాస్ జంగయ్య నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలం జూపల్లికి చెందిన లావణ్యను ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలానికే వారిద్దరి మధ్య కుటుంబ కలహాలు మొదలై తరచూ గొడవలు జరిగేవి. ఇతర మహిళలతో అక్రమ సంబంధాలు నెరిపిన జంగయ్య.. భార్య తనకు అడ్డుగా ఉందని, ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో జగన్ 2021 డిసెంబరు 17న రాత్రి భార్య లావణ్యతో గొడవపడ్డాడు. మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన జగన్ భార్య లావణ్యను గోడకు బలంగా నెట్టి దారుణంగా హతమార్చాడు. మృతురాలి సోదరుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని అప్పటి ఎస్ఐ వరప్రసాద్, సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాక్ష్యాధారాలు సేకరించిన అనంతరం నేరం రుజువు కావడంతో జంగయ్యకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.20వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్షపడడానికి కృషిచేసిన సీఐ ఉపేందర్, ఎస్ఐ వరప్రసాద్, అధికారులు జానయ్య, పీపీ రఘు, కోర్టు కానిస్టేబుల్ అవినాష్ కుమార్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

వరకట్న వేధింపులు..
భార్య మృతి కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

షాబాద్, జనవరి 8 : వరకట్న వేధింపులతో భార్య మృతి చెందిన కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి, రజినిలకు పదేళ్ల క్రితం వివాహమైంది. 12తులాల బంగారం కట్నంగా ఇచ్చేందుకు వధువు కుటుంబ సభ్యులు అంగీకరించి పెళ్లి జరిపించారు. నెల రోజులపాటు బాగానే కాపురం సాగింది. అనంతరం రాజేందర్‌రెడ్డి భార్య రజినిని వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. దాంతో రజిని ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన రజిని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చి 6వ తదీన2014వ సంవత్సరంలో మృతి చెందింది. ఈ కేసులో ఆమే వాంగ్మూలం మేరకు షాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితునికి ఎల్‌బీనగర్ రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం సోమవారం తీర్పును వెలువరించింది.

పత్తి లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

చేవెళ్ల, జనవరి 8 : ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి పత్తిలోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ మండల పరిధిలోని ఖానాపూర్ స్టేజీ వద్ద సోమవారం సాయంత్రం బోల్తాపడింది. మండల పరిధిలోని రామన్నగూడ గ్రామానికి చెందిన రైతు విఠల్ సాగు చేసిన తన పత్తిని ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని అమ్ముకునేందుకు వికారాబాద్ జిల్లా పూడూర్ మండల పరిధిలోని చిట్లెంపల్లి స్టేజీ వద్ద ఉన్న పత్తి మిల్లు వద్దకు ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి రోడ్డుపక్కకు దిగడంతో ఒక్కసారిగా ట్రాక్టర్ బోల్తాపడింది. రైతు విఠల్, డ్రైవర్ కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

● కుమారుడు కొట్టడం వల్లేనని సందేహాలు

షాద్‌నగర్ రూరల్, జనవరి 8 : రాత్రి ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. తెల్లారి లేచే సరికి ఓ ఇంట్లో మహిళ అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉంది. ముందు రోజు కుమారుడితో ఘర్షణ జరగడం, ఆ గొడవలో అతడు తల్లిని కొట్టడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని కేశంపేట రోడ్డులో నివాసం ఉంటున్న సుగుణమ్మ(42) కూలీ పనులు చేసుకుంటూ కుమారుడు శివ(18)తో కలిసి ఉంటోంది. ఆమె కల్లు, సారాకు అలవాటు పడి కుమారుడిని తరచూ డబ్బులు అడిగేది. ఆదివారం ఉదయం మద్యం తాగేందుకు రూ.20 ఇవ్వాలని శివను అడిగింది. అతడు ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో తల్లిపై శివ దాడి చేశాడు. ఆ తర్వాత అతడు కూలీ పనికి వెళ్లాడు. అనంతరం అతడు మధ్యాహ్నం ఇంటికి రాగా.. తల్లి మద్యం తాగి ఉండటంతో మళ్లీ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అదేవిధంగా రాత్రి కూడా తల్లీకుమారుల మధ్య గొడవ జరిగింది. సోమవారం ఉదయం నిద్ర లేచిన శివ.. తల్లి చనిపోయి ఉండటాన్ని గమనించాడు. వెంటనే తన సోదరికి విషయం చెప్పడంతో ఆమె వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.